క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో విష్ణుసహస్రనామార్చన



పూజలు చేస్తున్న అర్చకులు

రాజాం సిటీ: స్థానిక తాణా వీధిలోని రాజవేణు గోపాలస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కె.రవికుమార్‌శర్మ ఆధ్వర్యంలో తిరుప్పావై ప్రవచనాలతో పాటు విష్ణుసహస్రనామార్చన చేపట్టారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, భగవంతుని కృపకు పాత్రులయ్యారు.

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పనిచేయాలి



విద్యార్థులకు సూచనలిస్తున్న డిప్యూటీ డీఈఓ తిరుపతినాయుడు

రేగిడి: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పనిచేయాలని డిప్యూటీ డీఈఓ నల్లా తిరుపతినాయుడు ఉపాధ్యాయులను ఆదేశించారు. గురువారం మండలంలోని ఏవీపురం జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న అన్ని మౌలిక సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు కూడా మరింత బాధ్యతగా పనిచేసి, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు పెంచాలన్నారు. ప్రతీ విద్యార్థి విద్యా ప్రగతిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట డీసీఈబీ చైర్మన్ రాజు, రేగిడి, వంగర ఎంఈఓలు ఎంవీ ప్రసాదరావు, దుర్గారావు, హెచ్‌ఎం మురళీకృష్ణ పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి పూలంగి సేవ



ప్రత్యేకాలంకరణలో వేంకటేశ్వరస్వామి

మెంటాడ: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా స్థానిక శ్రీకల్యాణ వేంకటేశ్వరాలయంలోని స్వామి వారికి గురువారం పూలంగి సేవ నిర్వహించారు. పలు రకాల పూలతో స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు పి.శ్రీనివాసాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

కళ్లద్దాల పంపిణీ



వృద్ధులకు కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సన్యాసప్పలనాయుడు

మెంటాడ: వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని పోరాం గ్రామంలో పలువురు వృద్ధులకు ప్రభుత్వం మంజూరు చేసిన కళ్లద్దాలను జెడ్పీటీసీ సభ్యుడు లెంక సన్యాసప్పలనాయుడు చేతుల మీదుగా గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో చల్లపేట ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సూక్ష్మజీవుల వృద్ధిపై అవగాహన



వేరుశనగ పంటలో కాటన్‌క్లాత్ విధానంపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ పీఆర్‌పీ రమాదేవి

రాజాం సిటీ: మండలంలోని పొగిరి పంచాయతీ, బొడ్డవలస గ్రామంలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా సూక్ష్మజీవుల వృద్ధిపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ పీఆర్‌పీ డి.రమాదేవి తొలుత వేరుశనగలో కాటన్‌క్లాత్ విధానం అమలు చేశారు. 20"20 వెడల్పు కలిగిన కాటన్‌గుడ్డను అదే వెడల్పు, లోతులతో పొలంలో గొయ్యి తవ్వి అమర్చాలి. ఇలా నెల రోజుల తర్వాత గుడ్డను పరిశీలించాలని, తద్వారా సూక్ష్మజీవుల వృద్ధిని తెలుసుకునేందుకు వీలుంటుందన్నారు. అనంతరం అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలల్లో కిచెన్ గార్డెన్స్ నిర్వహణకు అవసరమైన కూరగాయల మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ జి.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై చెత్త వేస్తే జరిమానా

బొబ్బిలి: మున్సిపాలిటీలోని రోడ్లు, కాలువల్లో చెత్త వేస్తే జరిమానా విధించాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు సిబ్బందిని ఆదేశించారు. గురువారం స్థానిక ఫ్లైఓవర్ దగ్గరున్న ఓ మెకానిక్ షాపు యజమాని అక్కడి రోడ్డు, కాలువల్లో చెత్త వేయడాన్ని గుర్తించిన కమిషనర్ ఆయనకు రూ.1000 జరిమానా విధించారు. ఇదే తరహాలో ఉల్లంఘనులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు

- పెన్షన్ల పంపిణీలో ఎమ్మెల్యే కంబాల జోగులు



బాడంగి: లబ్ధిదారులకు పెన్షన్ అందిస్తున్న ఎమ్మెల్యే శంబంగి, జెడ్పీటీసీ రామారావు



రాజాం: లబ్ధిదారులకు పెన్షన్ అందిస్తున్న ఎమ్మెల్యే జోగులు

రాజాం: అర్హతే ప్రామాణికంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కొత్త పెన్షన్ల పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. 264 మందికి కొత్తగా మంజూరైన పెన్షన్లు అందజేసిన ఎమ్మెల్యే ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని, కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తున్నారన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ అమలుచేయనన్ని పథకాలు ఈ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని ఇచ్చిన హామీలతో పాటు బహిరంగ సభలు, సమావేశాలు, కార్యక్రమాల్లో ఇచ్చిన హామీలను సైతం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని వివరించారు. గతంలో ఇచ్చిన మాట ప్రకారం ఈ నెల నుంచి ప్రతీ పెన్షన్ లబ్ధిదారునికి రూ.2,750 పెన్షన్ అందించడం జరుగుతోందన్నారు. లబ్ధిదారులంతా ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని, మెరుగైన జీవనం సాగించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాజాం రూరల్ కన్వీనర్ ఎల్.రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బి.నర్సింహులు, వైస్ ఎంపీపీలు వై.వెంకటేష్, ఎస్.వర్షిణి, ఎంపీడీఓ బి.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శం..

బాడంగి: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో కొత్త పెన్షన్ల పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఎంపీపీ భోగి గౌరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇప్పుడు పెన్షన్‌ను విడతల వారీగా పెంచుకుంటూ పోతోందని తెలిపారు. ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేసే ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ప్రశంసించారు. గతంలోని టీడీపీ ప్రభుత్వం హయాంలో జన్మభూమి కమిటీ సభ్యులు చెప్పిన వారికే ప్రభుత్వ పథకాలు దక్కేవని, ఇప్పుడు అలా కాదని అర్హతే ప్రామాణికంగా, కుల, మత పార్టీలకు అతీతంగా పథకాలు అందజేయడం జరుగుతోందన్నారు. ఇవన్నీ ఓట్ల కోసమే చేస్తున్నారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయని, ఎనిమిదో తరగతి విద్యార్థులకు కూడా ట్యాబ్‌లు అందిస్తున్నారని వారికి ఓటుహక్కు ఉందా అని ప్రశ్నించారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ 175కి 175 స్థానాల్లో గెలవడం ఖాయమని జోష్యం చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పి.రామారావు, ఎంపీడీఓ అక్కారావు, తహసీల్దార్ బాల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి..

రేగిడి: అనకాపల్లిలోని హోమీ బాబా కేన్సర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రేగిడి మండలంలోని అప్పాపురం గ్రామానికి చెందిన బావిశెట్టి సరోజినికి వలంటీర్ బానాల కల్యాణి గురువారం పెన్షన్ అందజేశారు. వలంటీర్ ఆస్పత్రికి వెళ్లి మరీ పెన్షన్ అందజేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. అలాగే మండలంలోని వన్నలి, ఉప్పరనాయుడు వలస, చాటాయవలస, లక్ష్మీపురం గ్రామాల్లో కొత్తగా మంజూరైన పెన్షన్లను ఆయా గ్రామాల సర్పంచ్‌లు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

తెర్లాం: మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో పెన్షన్ల పంపిణీ గురువారం నిర్వహించారు. కొత్తగా పెంచిన పెన్షన్ నగదుతో కలిపి మొత్తం రూ.2,750 చొప్పున ఒక్కొక్క లబ్ధిదారునికి అందజేశారు.

వంగర: శ్రీకాకుళం జిల్లాలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని కొండచాకరాపల్లి గ్రామానికి చెందిన పిండ్యాల రామలింగేశ్వరస్వామికి వలంటీర్ గంట్యాడ వెంకట శ్రీనివాసరావు గురువారం ఆస్పత్రికి వెళ్లి మరీ పెన్షన్ అందజేశారు. ఈ మేరకు సదరు వలంటీర్ సేవాభావాన్ని గ్రామస్తులంతా మెచ్చుకుంటున్నారు.

బొబ్బిలి రూరల్: మండలంలోని కమ్మవలస, అలజంగి, పిరిడి గ్రామాల్లో పెన్షన్ల పంపిణీ గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా పెంచిన రూ.2,750 పెన్షన్ నగదును లబ్ధిదారులకు అందజేశారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



చొక్కాపు వీధిలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు

రామభద్రపురం: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రూ.2,500 ఉన్న పెన్షన్‌ను రూ.2,750కు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెంచడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. జనవరి నెల నుంచే పెంచిన పెన్షన్‌ను అందిస్తుండడంపై మండల కేంద్రంలోని చొక్కాపు వీధికి చెందిన పెన్షన్ లబ్ధిదారులంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నెలనెలా సమయానికి పెన్షన్ నగదును ఇంటి వద్దకే అందజేసి, తమను పెద్దకొడుకులా ఆదుకుంటున్నారని లబ్ధిదారులు ప్రశంసిస్తుండడం విశేషం

రైతుల సమక్షంలోనే భూముల రీసర్వే



మాట్లాడుతున్న ఆర్‌డీఓ శేషశైలజ

రామభద్రపురం: రైతుల సమక్షంలోనే భూముల రీసర్వే చేపట్టాలని ఆర్‌డీఓ శేషశైలజ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం సందర్శించిన ఆమె మండల వ్యాప్తంగా జరుగుతున్న సమగ్ర భూముల రీసర్వేపై తహసీల్దార్ పి.గణపతి రావును ఆరాతీశారు. సర్వే పూర్తయిన గ్రామాల్లోని రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని, పాస్ పుస్తకాలలో పొరపాటున భూ విస్తీర్ణంలో గానీ, సర్వే నంబర్లు గానీ తప్పుగా నమోదైతే ఆందోళన చెందవద్దన్నారు. ఒకవేళ తప్పులు పడితే రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలని వాటిని సరిచేస్తారని తెలిపారు. మీ దగ్గర ఎటువంటి చిన్న ఆధారం ఉన్నా సవరణ చేస్తామన్నారు. సమస్యలు లేని భూ రికార్డులు రైతులకు అందజేయడమే ప్రభుత్వం లక్ష్యమన్నారు. డివిజన్ పరిధిలోని 273 రెవెన్యూ గ్రామాలకు గాను ఇప్పటివరకు 100 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేశామని, మిగిలి వాటిల్లో కూడా సర్వే పూర్తికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు.

సాగునీటిని వృథా చేయొద్దు



మాట్లాడుతున్న భూగర్భ జల గణన ఏపీడీ మాధవి

తెర్లాం: సాగునీటిని వృథా చేయొద్దని జిల్లా భూగర్భ జల గణన శాఖ అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ మాధవి తెలిపారు. మండలంలోని లింగాపురం గ్రామంలోని రాణి చెరువు కింద ఉన్న ఆయకట్టు రైతులకు ఆంధ్రప్రదేశ్ సమీకృత సాగునీరు, వ్యవసాయ పరివర్తన పథకం(ఏపీఐఐఏటీపీ) ఆధ్వర్యంలో 'పంట-నీరు ప్రణాళిక'పై సర్పంచ్ బూరాడ తవిటినాయుడు అధ్యక్షతన గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు పంటలు పండించినప్పుడు ఎక్కువగా సాగునీటి వృథా చేస్తారని అయితే పంటలకు సాగునీరు ఎంతమేర అవసరమో అంతవరకే వినియోగించాలని కోరారు. తక్కువ నీటితో ఎక్కువ పంటలను రైతులు సాగు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఐఐఏటీపీ రీసోర్స్ పర్సన్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ సక్రమంగా అమలు చేయాలి

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో అమలులో ఉన్న జగనన్న గోరుముద్ద పథకానికి సంబంధించి ప్రభుత్వం కొత్తగా రూపొందించిన మెనూను సక్రమంగా అమలు చేయాలని ఎంఈఓ జె.త్రినాధరావు సూచించారు. మండలంలోని రంగప్పవలస ప్రాథమిక పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకం అమలును గురువారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం కొత్త మెనూ ప్రకారం వంటలు వండారా, లేదా వంటలు రుచికరంగా ఉన్నాయా లేదా అనేది పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామన్నారు.

టెన్త్ పరీక్ష కేంద్రాల తనిఖీ



తెర్లాం: పెరుమాళి హైస్కూల్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న మండల త్రిసభ్య కమిటీ సభ్యులు

తెర్లాం: మండలంలో 2023-24 విద్యా సంవత్సరంలో జగరనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రాలను మండల త్రిసభ్య కమిటీ సభ్యులు గురువారం తనిఖీ చేశారు. త్రిసభ్య కమిటీలో సభ్యులుగా ఉన్న ఎంఈఓ త్రినాధరావు, పెరుమాళి ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జ్యోతిలక్ష్మి, తెర్లాం హైస్కూల్ హెచ్‌ఎం పాపారావు కలిసి తెర్లాం, పెరుమాళి హైస్కూళ్లతో పాటు, పెరుమాళి మోడల్ స్కూల్, తెర్లాంలోని శ్రీవేంకటేశ్వర ఇంగ్లిష్ మీడియం స్కూల్ పరీక్ష కేంద్రాల సందర్శించి, అక్కడి సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం వారు విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు.

పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు ఉండాలి



సమీక్షిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్‌మోహన్‌రావు

సంతకవిటి: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు ఉండాలని జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావు సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంఈఓ బి.శాంతికుమారి, మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశమైన ఆయన పాఠశాలల్లో అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకం, మౌలిక సదుపాయాల కల్పనపై ఆరాతీశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆహారంతో పాటు మౌలిక వసతులు కల్పించాలని కోరారు.

లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు

రాజాం సిటీ: స్థానిక పాలకొండ జంక్షన్‌లో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజాం పట్టణంలోని మల్లిఖార్జునకాలనీకి చెందిన బోనంగి శ్రీనివాసరావు గాయాలయ్యాయి. శ్రీనివాసరావు తన ద్విచక్రవాహనంపై బస్టాండ్ నుంచి వస్తుండగా పాలకొండ నుంచి వచ్చిన లారీ ఢీకొనడంతో గాయాలైనట్లు ఎస్‌ఐ వీబీ రామకృష్ణ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, చికిత్స నిమిత్తం క్షతగాత్రుడిని స్థానిక సామాజిక ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎద్దులు, టైరుబండి అపహరణపై కేసు నమోదు

రాజాం సిటీ: మండలంలోని వీఆర్ అగ్రహారం గ్రామానికి చెందిన గుండాపు నాగరాజుకు చెందిన ఎద్దులతో పాటు టైరుబండి అపహరణపై గురువారం కేసు నమోదు చేశామని సీఐ కె.రవికుమార్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. 2022 డిసెంబర్ 21వ తేదీన పొలం పనులు ముగించుకుని నాగరాజు టైరు బండితో పాటు ఎద్దులను కల్లంలో కట్టాడు. ఆ మరుసటి రోజు కల్లంలోని ఎద్దులతో పాటు బండి కనిపించలేదు. దీంతో బాధితుడు ఉదయం పోలీసులను ఆశ్రయించి, ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు.

గడప గడపకు సంక్షేమం

- ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



ఇంటింటికీ వెళ్లి, సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో గడప గడపలో సంక్షేమం వెల్లివిరుస్తోందని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా స్థానిక పట్టణంలోని 20వ వార్డులో గురువారం పర్యటించిన ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం మూడున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. అలాగే ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే ప్రజలను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎస్.వేణుగోపాల నాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య



వంగర: విద్యార్థుల విద్యాసామర్థ్యాలు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈఓ శ్యామలరావు

వంగర: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని డిప్యూటీ డీఈఓ ఎన్.టి. శ్యామలరావు సూచించారు. గురువారం మండలంలోని మరువాడ, కోనంగిపాడు గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాలలను సందర్శించిన ఆయన అక్కడి విద్యార్థుల విద్యాసామర్థ్యాలను వివిధ ప్రశ్నల ద్వారా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యాప్రమాణాలు మెరుగుపరచాలని, ప్రతీ విద్యార్థి విద్యా ప్రగతిపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. మరువాడ జెడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థులు, రేగిడి మండలంలోని ఏవీపురం, కోనంగిపాడు పాఠశాల విద్యార్థులు బొబ్బిలి మండలంలోని చింతాడ పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు రాసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పనిచేయాలని సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ వై.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- రైతు భరోసా కేంద్ర ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే శంబంగి



డొంకినవలసలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బాడంగి: రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. మండలంలోని డొంకినవలస గ్రామంలో రూ.21.8 లక్షలతో కొత్తగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనాన్ని గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశానికి వెన్నెముక అయిన రైతు కష్టపడకూడదనే సదుద్దేశ్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాయితీపై విత్తనాలు, ఎరువులు సరఫరా దగ్గర నుంచి మద్దతు ధరకే పంట కొనుగోలు వరకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తున్నారని వివరించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత జి.శంకరరావు, మండల వ్యవసాయాధికారి కె.శిరీష, ఎంపీపీ బి.గౌరి, జెడ్పీటీసీ పి.రామారావు, పంచాయతీ రాజ్ డీఈఈ అప్పారావు, ఎంపీడీఓ అక్కారావు, తహసీల్దార్ బాలమురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

కలెక్షన్ సెంటర్ భవన నిర్మాణాల పరిశీలన



వంగర: భవన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఏడీ శైలజ

వంగర: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వెనక భాగంలో నిర్మిస్తున్న కలెక్షన్ సెంటర్ భవనాలను ఉద్యాన శాఖ ఏడీ కె.శైలజ గురువారం పరిశీలించారు. అనంతరం ఆమె పనులను త్వరితగతిన పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. ఆమె వెంట ఏఓ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభ

బొబ్బిలిరూరల్: మండలంలోని కమ్మవలస, రంగరాయపురం గ్రామ పంచాయతీల్లో గురువారం నిర్వహించిన గ్రామసభలో ఆయా పంచాయతీల్లో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై చర్చించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పి.వసుంధర, యు.గోవిందరావు, కార్యదర్శులు మధుసూదనరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన

బొబ్బిలి రూరల్: మండలంలోని నారాయణప్పవలస ఎంపీయూపీ పాఠశాలలో జరుగుతున్న మనబడి నాడు-నేడు పనులు, జగనన్న గోరుముద్ద పథకం అమలును వెలుగు ఏపీఎం స్వామి గురువారం పరిశీలించారు. విద్యార్థులను నాణ్యమైన భోజనం, విద్య అందించాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఆయన వెంట సీసీ తిరుమలరావు, వీఓఏ రమాదేవి ఉన్నారు.

సే నో డ్రగ్స్ పోస్టర్ ఆవిష్కరణ



సే నో డ్రగ్స్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఈబీ సీఐ జైభీమ్

బొబ్బిలి: స్థానిక పట్టణంలో సే నో డ్రగ్స్ పోస్టర్లు, స్టిక్కర్లను ఎస్‌ఈబీ సీఐ ఆర్.జైభీమ్ గురువారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన ఖైనీ, గుట్కా, గంజాయి, కొకైన్, హెరాయిన్ వంటి మత్తుపదార్థాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దని యువతకు సూచించారు.

10న జాబ్‌మేళా

బొబ్బిలి: పట్టణంలోని ఐటీఐలో ఈ నెల 10వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బండారు భాస్కరరావు ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ లిమిటెడ్‌లో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, టర్నర్, మెషినిస్ట్, వెల్డర్, డీజిల్ మెకానిక్, మోటారు వెహికల్ మెకానిక్ వంటి దాదాపు 100 పోస్టుల భర్తీకి అభ్యర్థులను ఇంటర్వ్యూ చేయడం జరుగుతుందన్నారు. ఆయా ట్రేడ్‌లలో ఉత్తీర్ణులై, 18-25 వయసు కలిగిన వారు అర్హులని, పదో తేదీ ఉదయం 9 గంటలకు అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని ఆయన కోరారు.

హెల్మెట్ తప్పనిసరి



రేగిడి: హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసరావు

రేగిడి: మండలంలోని మజ్జిరాముడుపేట కూడలిలో రోడ్డు ప్రమాదాల నివారణపై గురువారం అవగాహన కల్పించారు. ఎస్‌ఐ ఇ.శ్రీనివాసరావు మాట్లాడుతూ వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపవద్దని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు.

చురుగ్గా రోడ్డు నిర్మాణం

రాజాం: మండలంలోని కంచరాం నుంచి కొత్త కంచరాం వరకు బీటీ రోడ్డు నిర్మాణం చాలా చురుగ్గా జరుగుతోంది. దాదాపు రూ.1.80 కోట్ల అంచనా వ్యయంతో ఈ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు ఆర్ అండ్‌బీ జేఈ నాగభూషణ్ తెలిపారు. తొలుత కంచరాంలో సీసీ రోడ్డు నిర్మించారని, ప్రస్తుతం బీటీ రోడ్డు నిర్మాణం జరుగుతోందని వైఎస్సార్ సీపీ నేత గెద్దాపు అప్పలనాయుడు వెల్లడించారు.

3,300 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

రామభద్రపురం: మండలంలో 3,300 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్తయిందని ఎంపీడీఓ రమామణి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అగ్రికల్చరల్ ఏఓ వెంకటయ్యతో గురువారం ఆమె మాట్లాడుతూ మండలంలో దాదాపు 70 శాతం ధాన్యం సేకరణ పూర్తయిందని తెలిపారు. ఇంకా 600 నుంచి 700 మెట్రిక్ టన్నుల సేకరణ మాత్రమే ఉందన్నారు.